


దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 141 శనివారం 24-05-2025 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## భారత్‌తో రూ.180 కోట్ల రక్షణ ఒప్పందం రద్దు

**బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ నిర్ణయం**



కోల్‌కతా, మే 23: భారత్‌తో దౌత్య సంబంధాలు నానాటికీ దిగజారుతున్న వేళ ఇరు దేశాల మధ్య దూరాన్ని పెంచే విధంగా బంగ్లాదేశ్ మరో నిర్ణయం తీసుకుంది. కోల్‌కతాకు చెందిన ప్రభుత్వ రంగ నౌకా నిర్మాణ సంస్థతో రూ.180.25 కోట్ల విలువైన భారీ ఒప్పందాన్ని బంగ్లాలోని తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేసుకుంది. ఈ మేరకు భారత రక్షణ శాఖ పరిధిలో పనిచేసే గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ లిమిటెడ్ (జీఆర్ఎసఈ) తాజాగా స్టాక్ ఎక్స్ఛేంజీకి సమాచారం ఇచ్చింది. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ బంగ్లాదేశ్ ప్రభుత్వం తమకు ఇచ్చిన ఆర్డర్‌ను రద్దు చేసుకున్నట్లు తెలిపింది. సముద్రంలో ఓడలను లాక్కెళ్లడానికి, మునిగిపోయిన పడవలను వెలికి తీసే ఆపరేషన్లలో వినియోగించే అధునాతన టగ్ బోట్ల నిర్మాణం కోసం జీఆర్ఎసఈతో బంగ్లా ఒప్పందం చేసుకుంది.

# మోదీని ఎన్నిసార్లయినా కలుస్తా

## రాష్ట్రాభివృద్ధికి సహకారం తప్పక తీసుకుంటా

- ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు - ప్రతిపక్ష పదవి ఫామ్‌హౌస్‌లో పడుకోవడానికి కాదు - అసెంబ్లీకి హాజరై తప్పొప్పులు చెబితే దిద్దుకుంటాం
- మహిళలకు ఈ ఏడాది 21 వేల కోట్ల రుణాలు - అదానీ, అంబానీలతో పోటీపడి వ్యాపారం చేయాలి
- 5612 నిమ్జ్ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్లు - పట్టాలిప్పించే బాధ్యత జగ్గారెడ్డికి అప్పగిస్తున్నా
- 450 ఎకరాల్లో హ్యుందాయ్ కార్ల కంపెనీ - జహీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి

**సంగారెడ్డి, మే 23:** ఎన్నికల సమయంలోనే రాజకీయాలు మాట్లాడతానని, ఆ తర్వాత అందరినీ కలుపుకొని రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే తన పని అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటానని చెప్పారు. నిధుల కోసం ప్రధాని నరేంద్రమోదీని ఎన్నిసార్లయినా కలుస్తానని, రావాల్సిన నిధులు తెచ్చుకుంటామని స్పష్టం చేశారు. చెరువు మీద అలిగితే ఏమవుతుందో తెలుసునని, గత ముఖ్యమంత్రి చెరువు మీద అలిగి ఫామ్‌హౌసలో పడుకుంటే ఏమైందో అందరూ చూశారని వ్యాఖ్యానించారు. అందుకే సోనియా, రాహుల్, ఖర్గే సూచనలు పాటిస్తూ రాష్ట్ర ఆదాయాన్ని పెంచేలా ప్రయత్నిస్తున్నానన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి, కేంద్రీయ విద్యాలయం, నిమ్జ్ ఫోర్ లేన్ రహదారితోపాటు, బసవేశ్వర విగ్రహాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇండస్ట్రీలు, ఫార్మా, ఐటీ రంగాల్లో ప్రగతి సాధించాల్సి ఉందన్నారు. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే సంక్షేమ నినాదంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిననే అహంభావం తనకు ఏమాత్రం లేదని రేవంత్ అన్నారు. ఎప్పటిలాగే పేదోడు, పెద్దోడు అనే తేడా లేకుండా ఎవరినైనా కలుస్తున్నానన్నారు. జడ్పీటీసీగా, ఎమ్మెల్సీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఓసారి ఎంపీగా 20 ఏళ్లపాటు రాజకీయంలో ఉన్నా.. గతంలో ఏనాడూ అధికారంలో లేనని, అయినా ప్రజల్లో ఉన్నందునే ఈరోజు ముఖ్యమంత్రిగా అందరి ముందుకు వచ్చానని పేర్కొన్నారు. ప్రతిపక్షంలోనూ, అధికార పక్షంలోనూ ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని తెలిపారు. ప్రశ్నించే గొంతుకగా ఉండాల్సిన ప్రతిపక్ష నేత ఫాంహౌసలో పడుకుంటారా? అధికారం ఉంటేనే అసెంబ్లీలో అడుగుపెడతారా? అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. శాసనసభకు వచ్చి ఆయన అనుభవంతో తమ తప్పొప్పులు చెబితే సరిదిద్దుకుంటామని అన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలోని మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించారు. ఈ నిధులతో అదానీ, అంబానీలతో పోటీపడేలా ఆడబిడ్డలు వ్యాపారం చేయాలని ఆకాంక్షించారు. మెదక్ అంటేనే ఇందిరమ్మ అని, ఆమె మెదక్ ఎంపీగా గెలిచి ప్రధానమంత్రి అయ్యారని రేవంత్ గుర్తు చేశారు. బీడీఎల్, బీహెచ్ఈఎల్, ఇక్రిశాట్ సంస్థలు ఇందిరమ్మ చొరవతోనే ఏర్పాటయ్యాయన్నారు. కాగా, జహీరాబాద్ ప్రాంతంలోని నిమ్జ్ పారిశ్రామిక కారిడార్‌లో 450 ఎకరాలను హ్యుందాయ్ కార్ల పరిశ్రమకు కేటాయించినట్లు సీఎం వెల్లడించారు. హ్యుందాయ్ పరిశ్రమతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ ప్రాంతంలో చెరుకు పండించే రైతులు ఒక సహకార సంఘంగా ఏర్పాటైతే వారి కోసం 100 ఎకరాలను కేటాయిస్తామని అన్నారు. చక్కెర పరిశ్రమను వారి ఆధ్వర్యంలో అద్భుతంగా నిర్వహించుకోవచ్చని సూచించారు. ఇక దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దడమే కాకుండా న్యూయార్క్, టోక్యో నగరాలతో పోటీపడే విధంగా హైదరాబాద్ మారుతుందని చెప్పారు. మంజీరా జలాలతో హైదరాబాద్ దాహార్తిని తీరుస్తున్న సింగూరు రిజర్వాయర్‌ను ఎకో టూరిజంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. వార్డుమెంబరు నుంచి పార్లమెంటు మెంబరు వరకు కాంగ్రెస్ కార్యకర్తలను గెలిపించుకోవడానికి తన శాయశక్తులా కష్టపడతానన్నారు. కాగా, జహీరాబాద్‌లో బసవేశ్వర విగ్రహాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుడు గొప్ప నాయకుడని, సమాజంలో అణచివేతకు గురైన బలహీనవర్గాల తరఫున నిలబడ్డాడని కొనియాడారు. ఆ రోజుల్లో అనుభవ మంటపాలను ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించేవారని తెలిపారు. ఆ అనుభవ మంటపాల ఆధారంగానే నేడు అసెంబ్లీ పార్లమెంటులో సమస్యల పరిష్కారం కోసం మాట్లాడుతున్నామని చెప్పారు.





## తెలంగాణలో 3 కొత్త కేంద్ర సంస్థలు

**అంతర్జాతీయ స్థాయి మిల్లెట్స్ పరిశోధన కేంద్రం.. కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్**

**జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రం కూడా**

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



**హైదరాబాద్, మే 23:** తెలంగాణలో కేంద్ర ప్రభుత్వం మూడు కొత్త సంస్థలను ఏర్పాటు చేయబోతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఇక్కడ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. 2014 నుంచి రాష్ట్రానికి కొత్తగా పలు కేంద్ర సంస్థలు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కొత్తగా ఏర్పాటు చేయబోతున్న మూడు కేంద్ర సంస్థల గురించి వెల్లడించారు. మిల్లెట్స్ ప్రాధాన్యాన్ని పెంచే క్రమంలో భాగంగా మోదీ సర్కారు తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి మిల్లెట్స్ పరిశోధన కేంద్రాన్ని మంజూరు చేసిందని తెలిపారు. రూ.250 కోట్లతో 'గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్'ను కేంద్ర వ్యవసాయ శాఖ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుందని ఆయన పేర్కొన్నారు. అలాగే.. సికింద్రాబాద్ నియోజకవర్గంలో 'కవచ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ప్రారంభం కానుందని.. జాతీయ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని (నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను) కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని కిషన్‌రెడ్డి వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రియల్ ఎస్టేట్ వ్యాపారుల దగ్గర నుంచి, పరిశ్రమల నుంచి 'ట్రిపుల్ ఆర్ ట్యాక్స్' పేరిట భారీ వసూళ్లు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

## కుల సర్వే జరిపించడం నాకు గర్వకారణం

**కేసీఆర్ నియంత.. రేవంత్ ప్రజాస్వామికవాది**

**బీఆర్ఎస్ ముక్కలవడం ఖాయం: మహేశ్‌గౌడ్**

**నెలాఖరులోపు పీసీసీ కార్యవర్గం**

**రెండు నెలాల్లో మండల, జిల్లా అధ్యక్షుల నియామకం: మహేశ్‌గౌడ్**

**న్యూఢిల్లీ, మే 23:**
టీపీసీసీ అధ్యక్షుడిగా తన ఏడు నెలల పదవీకాలంలో అత్యంత సంతృప్తికర అంశం కుల సర్వే అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. తెలంగాణలో చేసిన కుల సర్వే దేశానికే ఆదర్శంగా నిలవడం, బీసీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతుండటంతో ప్రధాని మోదీ సైతం కలవరపడి దేశవ్యాప్తంగా కులగణన జరిపిస్తామని ప్రకటించారని చెప్పారు. ఇందుకు తాను గర్వపడుతున్నానని పేర్కొన్నారు. నిజానికి ఆర్ఎస్ఎస్ కులగణనను వ్యతిరేకించిందన్న విషయాన్ని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ సమక్షంలో కులగణనపై ఇతర రాష్ట్రాల నేతలకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చే అవకాశాన్ని తనకు ఇచ్చారని తెలిపారు. శనివారం తన జన్మదినం సందర్భంగా ఢిల్లీలో ఆంధ్రజ్యోతి ప్రతినిధికి మహేశ్‌గౌడ్ ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో.. రేవంత్‌రెడ్డి పీసీసీ అ?ధ్యక్షుడిగా, తాను కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కులగణన, బీసీలకు 42శాతం రిజర్వేషన్ వాగ్దానం చేశామని, ఆరు గ్యారంటీలను ప్రకటించామని.. కాంగ్రెస్ అధికా రంలోకి వచ్చేందుకు కారణమయ్యాయని చెప్పారు. ఆ హామీలన్నీ నెరవేర్చడంతో దేశమంతా తెలంగాణ వైపు చూస్తోందన్నారు. రేవంత్ రెడ్డి వర్గానికి చెందినప్పటికీ రాష్ట్రంలో బీసీలు కాంగ్రెసకు సానుకూలంగా మారేందుకు తోడ్పడ్డారని.. సోనియా, రాహుల్ వాగ్దానాలు, రేవంత్ ఆకర్షణ కాంగ్రెసను గెలిపించాయని పేర్కొన్నారు. గత ఏడు నెలలుగా పార్టీ, ప్రభుత్వం చక్కటి సమన్వయంతో పనిచేశాయని, అందువల్లే ప్రజల్లో ప్రభావం చూపించగలిగామని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు.



## నేడు 10వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం..

**అన్ని రాష్ట్రాల సీఎంలకు ఆహ్వానం..**



నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన నీతి ఆయోగ్ 10వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం (%చీ×u×ాఖఎశీస్త్ర 10ష్ట్ర జశీబఅఎఱశ్రీ వీవవ్‌ఱఅస్త్ర%) జరగనుంది. ఈ సమావేశం 'వికసిత రాజ్యం కోసం వికసిత భారత్‌ఏ2047' అనే ఇతివృత్తంతో నిర్వహించబడుతుందని కేంద్ర ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలో దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉంటారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత మొదటిసారిగా ఈ భేటీ జరగనుండటం విశేషం. ఇది దేశ అభివృద్ధి లక్ష్యాలకు కొత్త ఊపును ఇవ్వనుంది. వికసిత రాజ్యం కోసం వికసిత భారత్ అనే భావన రాష్ట్రాలు జాతీయ ప్రాధాన్యతలు, స్థానిక వాస్తవాలకు అనుగుణంగా దీర్ఘకాలిక, సమగ్రమైన దార్శనిక పత్రాలను రూపొందించాలని పిలుపునిస్తుంది. ఈ దార్శనిక పత్రాలు కాలపరిమిత లక్ష్యాలను కలిగి ఉండాలని, అవి రాష్ట్రాల భౌగోళిక, జనాభా పరమైన ప్రత్యేకతలను సద్వినియోగం చేసుకోవాలని నీతి ఆయోగ్ సూచించింది. మానవ వనరుల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి, సుస్థిరత, సాంకేతికత, పాలన సంస్కరణలపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా రాష్ట్రాలు ఈ లక్ష్యాలను సాధించగలవని ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలో డేటా ఆధారిత ప్రక్రియలు, ఫలిత ఆధారిత మార్పును ప్రోత్సహించే చర్చలు జరుగనున్నాయి. ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లు, సమాచార సాంకేతికత (ఐసీటీ) ఆధారిత మాధ్యమాలు, పర్యవేక్షణ, మదింపు విభాగాల ద్వారా జవాబుదారీతనం వంటివి ఈ విధానంలో కీలకమైన అంశాలుగా ఉన్నాయి. ఈ చర్యలు రాష్ట్రాలు తమ అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి సహాయపడతాయని నీతి ఆయోగ్ అభిప్రాయపడింది. ఈ సమావేశంలో వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, నైపుణ్య అభివృద్ధిని మెరుగుపరచడం, స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టించడం వంటి అంశాలపై కూడా చర్చించనున్నారు. దేశవ్యాప్తంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించడం, వ్యాపారవేత్తలకు అనుకూలమైన వాతావరణం కల్పించడం, ఉద్యోగ అవకాశాలను పెంచడం వంటి వ్యూహాలు ఈ సమావేశంలో ప్రధాన చర్చా అంశాలుగా ఉంటాయి. రాష్ట్రాలు తమ ప్రత్యేక బలాలను ఉపయోగించుకుని, ఈ లక్ష్యాలను సాధించేందుకు సమర్థవంతమైన విధానాలను రూపొందించాలని నీతి ఆయోగ్ సూచించింది.నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం, కేంద్రం, రాష్ట్రాల/కేంద్రపాలిత ప్రాంతాల మధ్య సమన్వయాన్ని పెంచే ఒక వేదికగా పనిచేస్తుంది. దేశం ఎదుర్కొంటున్న అభివృద్ధి సవాళ్లను పరిష్కరించడానికి, భారతదేశాన్ని వికసిత దేశంగా మార్చడానికి రాష్ట్రాలు ప్రధాన భాగస్వాములుగా ఉండాలని ఈ సమావేశం లక్ష్యంగా పెట్టుకుంది. సమగ్రమైన, సుస్థిరమైన అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర సహకారం అత్యంత కీలకమని నీతి ఆయోగ్ ప్రకటనలో వెల్లడించింది.

## మన విదేశాంగ విధానం కుప్పకూలింది: రాహుల్



**న్యూఢిల్లీ, మే 23:** కేంద్ర మంత్రి జైశంకర్ తీరుతో మన విదేశాంగ విధానం కుప్పకూలిపోయిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. పృథ్వీరాజ్ సింగ్ చౌహాన్‌కు వ్యతిరేకంగా మహమ్మద్ ఘోరీతో చేతులు కలిపిన రాజపుత్ ప్రభువు జైచంద్ పేరు ధ్వనించేలా జైశంకర్‌ను 'జై చంద్ జై శంకర్– జేజే' అని సంబోధిస్తూ ఆయనపై రాహుల్ ప్రశ్నల వర్షం కురిపించారు. "పాకిస్థాన్ చర్యలను ఖండిస్తూ ఎందుకని ఒక్క దేశమూ మన వెనుక నిలబడలేదు?" అంటూ నిలదీశారు. "ఉగ్రవాదంపై పాక్ ప్రకటనను ఎలా విశ్వసించారు? భారత ప్రయోజనాలను ఎందుకని ట్రంప్‌కు ఫణం పెట్టారు? కెమెరాల ఎదుట మాత్రమే ఎందుకని మీ రక్తం పొంగుతుంది? వట్టి ప్రసంగాలు కట్టిపెట్టి ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పండి" అని రాహుల్ డిమాండ్ చేశారు.

## కాళేశ్వరంలో నవరత్న మాల హారతి!

**ఏకాదశి సందర్భంగా కాశీ వేదపండితుల నిర్వహణ**

**9వ రోజు సరస్వతి పుష్కరాలకు 1.30 లక్షల మంది భక్తులు**

**భూపాలపల్లి, మే 23:** కాళేశ్వరం త్రివేణి సంగమంలో జరుగుతున్న సరస్వతి నది పుష్కరాలకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఏకాదశి కావడంతో కాశీ నుంచి వచ్చిన వేద పండితులు కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో ప్రత్యేకంగా నవరత్న మాల హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. హంపి పీఠాధిపతి విరుపాక్ష విద్యారణ్య స్వామీజీ 9వ రోజు పుష్కర కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై సరస్వతి నదిలో పుణ్యస్నానం చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. శుక్రవారం 1.3 లక్షల మంది భక్తులు తరలిచ్చి పుణ్యస్నానాలు చేశారు. వర్షంతో వాహనాలు బురదలో దిగబడే ప్రమాదం ఉండటంతో అన్నారం క్రాస్ నుంచి పూస్కుపల్లి మీదుగా ప్రైవేటు వాహనాలను కాళేశ్వరం పార్కింగ్ స్థలాలకు మళ్లించారు. ఉదయం దాదాపు రెండు గంటల పాటు పుస్కుపల్లి వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడినా అధికారులు స్పందించి క్రమబద్ధీకరించారు.



# జిల్లాలోని గిరిజన ప్రాంతాలలో నివసించే యువత అన్ని రంగాల్లో ముందుండాలి

## ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 23** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని గిరిజన ప్రాంతాలు మరియు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ ప్రజలకు,మైదాన ప్రాంతాల్లోని వలస గిరిజన యువతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ రకాల కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. ఇందులో భాగంగానే ఈ రోజు దమ్మపేట పోలీసుల ఆధ్వర్యంలో దమ్మపేట మండలంలోని కొండ రెడ్ల గ్రామమైన పూసుకుంటలో ఉండే 12 మంది యువకులకు దమ్మపేట పోలీసుల ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్సులను ఇప్పించడం జరిగినది.ఈ రోజు ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ చేతుల మీదుగా వారికి లైసెన్స్ కాపీలను అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో,ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే యువతకు పోలీస్ శాఖ అన్ని రకాలుగా అండగా ఉంటుందని తెలిపారు.వారికి క్రీడా పోటీలు నిర్వహించడం, ఉద్యోగాలు సాధించేలా వారిని ప్రోత్సహించి కోచింగ్ ఇప్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని అన్నారు.ఎంతోమంది ఏజెన్సీ ప్రాంత యువత మద్యానికి బానిసలై వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై తమ ప్రాణాలను పోగొట్టుకుంటున్నారని అన్నారు.కనీసం డ్రైవింగ్ లైసెన్సులు కూడా లేకుండా పోలీసుల వాహన తలిఖీలలో పట్టుబడుతున్నారని అన్నారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాలలో నివసించే యువతకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రైవింగ్ లైసెన్స్ లను ఇప్పించడం జరుగుతుందని తెలిపారు.అనంతరం పూసుకుంట గ్రామ యువతను వారి గ్రామ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ విద్యారంగానికి మూల స్తంభాలు

## జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 23** ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ విద్యా రంగాన్ని నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించాలని, వారు పాఠశాల నాయకులుగా ఉపాధ్యాయులకు అకాడమిక్ మార్గదర్శకత్వం వహిస్తూ విద్యార్థిని విద్యార్థుల పట్ల సానుకూల దృక్పథంతో ఉంటూ నాణ్యమైన విద్యను పిల్లలకి అందించడంలో నిజమైన నాయకులుగా ఎదగాలని సూచించారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల వృత్యంతర శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు మనసుపెట్టి పనిచేస్తే సాధించలేని కార్యం ఏది ఉండదని, పాఠశాలలో సమాజ భాగస్వామ్యం పెంచుతూ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో తమ పాత్ర పోషించాలని కోరారు. అంతకుముందు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాత పాల్వంచలో జరుగుతున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించి మనుషుల నివాసానికి అనుకూలమైన ఈ భూగ్రహాన్ని రక్షించడంలో జీవశాస్త్ర ఉపాధ్యా యులు కీలక పాత్ర పోషించాలని జీవశాస్త్రం చదవటం అంటే కేవలం డాక్టర్ గా స్థిరపడటం అనే ఒక అపోహ నుండి బయటపడి ఎన్నో వినూత్నమైన కోర్సులను అధ్యయనం చేస్తూ మానవాళికి అవసరమైన సహజ సిద్ధమైన ఆహార పదార్థాలను మొక్కల ద్వారా అందించడం ఒక ప్రధాన బాధ్యతగా తీసుకోవాలని కోరారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో వినియోగించి



విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందించాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్, జీవశాస్త్ర శిక్షణా కేంద్ర ఇంచార్జ్ ఏ. పద్మలత, రాష్ట్ర పరిశీలకులు శ్రీహరి, రిసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య



**తొలి సమయం వరంగల్ మే 23** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మరోసారి మానవత్వం చాటుకున్నారు. పరకాల పర్యటనలో భాగంగా హనుమకొండ నుండి పరకాల రోడ్డు మార్గంలో వెళుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని చూసి తన వాహనాన్ని నిలిపివేశారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య స్వయానా ఒక డాక్టర్. రాజకీయ నాయకురాలు అనే కాదు డాక్టర్గా ఎందరికో వైద్య సేవలను అందించారు.తాజాగా ఆమెలో మరోసారి డాక్టర్ బయటికి వచ్చారు.రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తులకు వెంటనే ప్రథమ చికిత్స చేసి అందరిచేత ప్రశంసలు అందుకున్నారు.దామెర మండలం, సైలని బాబా దర్గా సమీపన బైక్ యాక్సిడెంట్ జరిగింది. అటుగా వెళుతున్న పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తన వాహనాన్ని ఆపి సంఘటన స్థలంలో జరిగిన ప్రమాదం గురించి ఆరా తీశారు. వెంటనే గాయపడిన వారికి ప్రథమ చికిత్స నిర్వహించి అంబులెన్స్ పిలిపించి, సమీప ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ఇలా రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి సాయం చేయడం మొదటిసరేం కాదు. గతంలోనూ తన కాన్వాయ్ని ఆపి.. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించారు.

# హన్మకొండ డివిజన్ పరిధిలో అభివృద్ధి పలు కార్యక్రమాలు

**తొలి సమయం వరంగల్ మే 23** పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఈ రోజు 9 వ వార్డు మరియు 4 వ వార్డు సుధా నగర్,లోటస్ కాలనీ,యాదవ నగర్ లలో అంతర్గత రోడ్ల నిర్మాణం మరియు సైడ్ డ్రైన్ ల నిర్మాణం కోరకు రూ.50 లక్షలతో శంకుస్థాపనలు చేసిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి,నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి వర్షాకాలం ప్రారంభం దృష్ట్యా నగరంలో %ూదీజ% కేటగిరీలుగా ప్రాంతాలను ఎంపిక చేసిన అత్యవసర కాలనీలకు త్వరగతిన పనులను పూర్తే చేసే పనిలో భాగంగానే శంకుస్థాపనలు చేపడుతున్నామని ఎమ్మెల్యే నాయిని అన్నారు.కొబ్బరికాయ కొట్టిన అనతి కాలంలోనే పనులను పూర్తి చేస్తున్నామని వర్షపు నీరు ఆగకుండా చూడాలనేది మా బాధ్యత అని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోనే అధిక నిధులను మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలలో అండగా నిలిచిన సందర్భంగా జిల్లా మరియు నియోజకవర్గ ప్రజల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.శరవేగంగా జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగస్వామ్యం అవుతున్న పార్లమెంట్ సభ్యులు శ్రీమతి కడియం కావ్య,నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి,KUDA చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.



రానున్న రోజుల్లో నియోజకవర్గం అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ప్రజల సహకారం ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు,పార్టీ నాయకులు ,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందులో కన్నుల పండుగగా హనుమాన్ జయంతి శోభాయాత్ర

**తొలిసమయం, ఇల్లందు.మే 23.** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఇల్లందు పట్టణంలో గురువారం సాయంత్రం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది . హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ శోభాయాత్రలో హనుమాన్ దీక్షాపరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ శోభాయాత్రను ఆహ్లాదకరంగా మార్చేందుకు భక్తులు పూల వర్షం కురిపించారు. పూలతో శోభాయాత్రకు



స్వాగతం పలికే కార్యక్రమం అద్భుతంగా ఆకట్టుకుంది. చిన్నా%-%పెద్దా అనే తేడా లేకుండా భక్తులు పాల్గొని తమ భక్తిశ్రద్ధను చాటుకున్నారు. పట్టణ పురవీధులన్నీ జై హనుమాన్ నినాదాలతో మార్మోగి పోగా, హనుమాన్ జయంతి వేడుకలు ఇల్లందులో మరుపురాని సంఘటనగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో పూలు మరియు మజ్జిగ ప్యాకెట్ల దాతలుగా అర్వపల్లి రాధాకృష్ణ, దివ్వెల రమేష్, చందా చక్రధర్, పల్లెర్ల చంద్రశేఖర్, యెలుగూరి మధుబాబు, యెలుగూరి నాగేష్ కుమార్, వ్యామసాని జనార్ధన్ రావు, యెలుగూరి మల్లికార్జున్, సైఫా రాజశేఖర్, పుల్లూరు సతీష్ కుమార్, కుమ్మరి కుంట్ల నారాయణ, గందె సురేష్, రామిడి శంకర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు నరేంద్రులు అను, వాసవి క్లబ్ అధ్యక్షుడు భోనగిరి రవికిరణ్, కటకం సత్యందర్, నాగరాజు, తాటిపల్లి సుబ్బారావు, దివ్వెల నాగేశ్వరరావు, గౌరిశెట్టి నగేష్, నరేందర్ తదితరులు విశేష సహకారం అందించారు.

# చౌరస్తా మోరి పరిశీలించిన ఎమ్మెల్యేనాయిని, మేయర్ సుధరాణి




**తొలి సమయం వరంగల్ మే 23** నగరంలో రెండు రోజులు కురిసిన వర్షాల నేపథ్యంలో పలు ప్రాంతాల్లో డ్రైనేజీ (మురికి కాలువలు) నీటితో నిండిపోయి ఉండటం వల్ల ప్రజలు ఇబ్బందులు గురికావద్దని మున్సిపల్ శాఖ అధికారులు,ఇంజనీరింగ్ విభాగ అధికారులు ప్రధాన కాలువలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.శుక్రవారం రోజున నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి మరియు అధికారులతో కలిసి చౌరస్తా దగ్గర ఉన్న మోరీని పరిశీలించారు.గడిచిన రెండు రోజులు కురిసిన వర్షం కారణంగా చెత్తతో డ్రైన్ నిండిపోవడం గమనించారు .రానున్న వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.పొంగిపొర్లే ప్రాంతాల్లో అండర్ డ్రైనేజీ లను ఎప్పటికప్పుడూ పరిశీలించాలని సూచించారు.

# దుర్గమ్మ పండుగ వేడుకలలో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**తొలి సమయం రాయపర్తి మే 23** రాయపర్తి మండలం మొరిపిరాల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు చిలువేరు సాయి గౌడ్ పిలుపు మేరకు దుర్గమ్మ ఉత్సవాలలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, తన ఇంట్లో పండుగ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన. రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, ఎర్రబెల్లి దయాకర్ రావు ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తో పాటు జిల్లా, మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు యూత్ సోషల్ మీడియా నాయకులు, తదితరులు పాల్గొన్నారు...

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**తొలి సమయం మండలం మే 23** రాయపర్తి మండలం కొండూరు గ్రామంలో.బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు శిలా మహేష్ - స్వాతి వివాహ వేడుకకి ముఖ్య అతిథిగా పాల్గొని నూతన వధూవరులను నిండు మనసుతో అక్షింతలు వేసి ఆశీర్వదించినరాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గారితో పాటు జిల్లా, మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు యూత్ సోషల్ మీడియా నాయకులు, తదితరులు పాల్గొన్నారు...

# అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించిన డోర్నకల్ మాజీ శాసనసభ్యుడు డీఎస్ రెడ్యా నాయక్



**తొలి సమయం దంతాలపల్లి మే 23** దంతాలపల్లి మండలం కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త అయిన మద్దిరాల వీరస్వామి మనుమడి అన్నప్రసాద కార్యక్రమం నరసింహుల పేట దేవస్థానంలో జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోర్నకల్ మాజీ శాసనసభ్యుడు డీఎస్ రెడ్యానాయక్ హాజరై ఆశీర్వదించాడు. ఆయన వెంట ఓలాద్రి మల్లారెడ్డి, వేణు, తండ రాములు, అనీలు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల కష్టాలను తీర్చే పార్టీ కాంగ్రెస్ పార్టీ

## కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**తొలి సమయం వరంగల్ మే 23**

పేద ప్రజల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు.రఘునాథపల్లి మండల కేంద్రంలో ని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని 42మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు 42లక్షల 04వేల 872రూపాయల విలువగల చెక్కులను అలాగే 13మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు 9లక్షల 36వేల 500రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూస్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఒక్క రఘునాథపల్లి మండలంలోనే ఏడాదిన్నర కాలంలో 400మంది లబ్ధిదారులకు సుమారు 4కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వం పై 8లక్షల కోట్ల అప్పులు ఉన్నా వాటికీ మిత్తిలు కడుతున్న పేద ప్రజల సంక్షేమాన్ని ఆపకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆదాయనికి మించి ఖర్చులు ఉండడం వల్ల ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ రైతులకు 21వేల కోట్ల రుణ మాఫీ, సన్నాలు పండించే రైతులకుక్వింటాకు 500బోనస్, ఎకరానికి 12వేల రూపాయల రైతు భరోసా వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత కల్పిస్తుందని అందులో భాగంగానే మహిళకు ఫ్రీ బస్ సౌకర్య, 200యూనిట్ల ఉచిత విద్యుత్, 500రూపాయల గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలను మహిళలకు అందిటున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని పేద వర్గాల ఆకలిని గుర్తించి వారికీ కడుపు నిండా అన్నం పెట్టాలనే ఆలోచనతో రేషన్ షాపుల ద్వారా తెల్ల రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. ఇప్పటికే 800కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి నిత్యం కృషి చేస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, ఆర్డివో, తహసీల్దార్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం పాల్గొన్న మంత్రి పొన్నం,ఎమ్మెల్యే నాయిని

**తొలి సమయం వరంగల్ మే 23**

కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశంలో భాగంగా ఈ రోజు హనుమకొండ జిల్లా భీమదేవరపెల్లి ,ఎలకతుర్తి మండల కేంద్రాల్లో మండల స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మంత్రి పొన్నం ప్రభాకర్,హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ,ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ శ్రీ మక్సుద్ అలీ కాంగ్రెస్ పార్టీ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు రాష్ట్ర ఇంచార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్ గారు,పీసీసీ అధ్యక్షుడు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నారని ,పార్టీ కష్టకాలంలో ఉన్న వారికి,పార్టీకోసం అధిక సమయం కేటాయించే వారికి బాధ్యతలు అప్పగించాలని సూచించారు.గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కార్యకర్తల ఆమోదం తప్పనిసరి అని చెప్పారు.అన్ని సామాజిక వర్గాలలోను సమానత్వం చేస్తూ నూతన కమిటీలను ఏర్పాటుచేయాలని అన్నారు.పార్టీ పునర్నిర్మాణంలో గతంలో ఎక్కువ కాలం చేసిన వారు కొత్తవారికి స్వచ్ఛందంగా అవకాశాలు కల్పించాలని అన్నారు.పదవిలో ఉండి పార్టీ కార్యక్రమాల పట్ల ఆసక్తి చూపని వారిని గుర్తించి నూతన ఉత్సాహవంతులని నియమించాలని సూచించారు. బ్లాక్ కాంగ్రెస్, మండల పార్టీ,గ్రామ శాఖ అధ్యక్ష కమిటీలను త్వరగతిన ఏర్పాటు చేయాలని కోరారు.ప్రభుత్వం ఏర్పాటులో కార్యకర్తల భాగస్వామ్యం కీలకమని,పార్టీ కోసం అకుంఠితంగా పనిచేసిన వారికి నేడు నటరాజన్ గారి నాయకత్వంలో పార్టీ పదవులు దక్కుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు.



రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ స్థాయిలో మరింత బలోపేతం కావడానికి,రానున్న రోజుల్లో జరిగే ప్రతి ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించే సత్తా చాటాలని నూతన ఒరవడితో ముందుకు వెళ్తుందని అన్నారు.ఈ సమావేశాల్లో ఇరు మండలాల మండల అధ్యక్షులు,బ్లాక్ అధ్యక్షులు,అనుబంధ సంఘాల అధ్యక్షులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పది

# ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలి

## ప్రతి జిల్లాలో రెడ్ క్రాస్ ఏర్పాటు చెయాలి



**తొలి సమయం వరంగల్ మే 23**

అత్యవసర సమయాల్లో సరైన రక్తం అందకపోతే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందిరక్తదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత పరకాలలో నూతనంగా నిర్మించనున్న రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజీ సెంటర్ శంకుస్థాపన, భూమి పూజ కార్యమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని, రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయటమే అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. పరకాల మండల కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లడ్ స్టోరేజీ సెంటర్ శంకుస్థాపన, భూమి పూజ కార్యమానికి స్థానిక శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్యఅతిథిగా హాజరై భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ రక్తదానంతో ప్రాణాపాయంలో ఉన్న వారిని బతికించవచ్చన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఒక వైద్యురాలిగా రక్తం విలువ తనకు తెలుసని అన్నారు.అత్యవసర సమయాల్లో బ్లడ్ అందుబాటులో లేక ఎంతో మంది ఇబ్బందులు పడుతూ ఉంటారని, ప్రమాదాలు జరిగినప్పుడు, ప్రెగ్నెంట్ లేడీస్, పోస్ట్ డెలివరీ సమయాల్లో సైతం బ్లడ్ అవసరం ఉంటుందని తెలియజేశారు. ప్రతి జిల్లాలో రెడ్ క్రాస్ అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం వరంగల్, హనుమకొండ జిల్లాలో రెడ్ క్రాస్ ఉందని, భూపాలపల్లి జనగామ జిల్లాల్లో రెడ్ క్రాస్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధిగ్రస్తులకు బ్లడ్ చాలా అవసరమని బ్లడ్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా జిల్లాలోని రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ అందుబాటులో ఉంటే ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు.రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ నిర్వహణతో పాటు డ్రగ్ డిడిక్షన్ సెంటర్, ఆడపిల్లలకు రక్తహీనత పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్ ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఎంపీ వివరించారు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ లో తలసేమియా ఐ సి ఎం ఆర్ పరిశోధన కేంద్ర ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. హనుమకొండ జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రా ఏర్పాటుకు సంబంధించి నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేయాలని ఎంపీ సూచించారు. రెడ్ క్రాస్ సొసైటీ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ విజయ్ చందర్ రెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, పరకాల హాస్పిటల్ సూపరింటెంట్ గౌతమ్ చౌహన్, మరియు RDO, MRO, MPDO, మున్సిపల్ కమిషనర్ రెడ్ క్రాస్ పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎరువుల విక్రయాలు ఈపాస్ మెషిన్ల ద్వారానే చేపట్టాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**తొలి సమయం వరంగల్ మే 23**

ఎరువుల విక్రయాలను ఈపాస్ మెషిన్ల ద్వారానే చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు.శుక్రవారం వరంగల్ శివనగర్ లోని సాయి కన్వెన్షన్ లో వరంగల్ జిల్లాలోని రిటైల్ ఎరువుల వ్యాపారులకు కొత్త %ూ%1 ఈపాస్ మెషిన్ల కంపెనీ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొని డీలర్లకు ఈపాస్ మెషిన్ ను అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ డీలర్లు అందరూ తప్పనిసరిగా ఎరువుల విక్రయాలను ఈపాస్ మెషిన్ ద్వారా మాత్రమే చేపట్టాలని అన్నారు.( పస్తుతం ఉన్న ఈపాస్ మిషన్ల స్థానంలో కొత్త L1 ఈపాస్ మెషిన్లను పంపిణీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఎరువుల శాఖ వారు మరియు రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఆదేశాల మేరకు ఈరోజు 171 ఈపాస్ మెషిన్లను కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ వారు డీలర్లకు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది తెలిపారు. రైతులకు ఎరువుల పంపిణీ పారదర్శకంగా సాగేందుకు, ప్రభుత్వ నిబంధనల మేరకు ఆధునిక సాంకేతికత వినియోగం లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు.“ఈ-పాస్ మెషిన్లతో ఎరువుల పంపిణీ మరింత సమర్థవంతంగా సాగుతుందని. రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో, సరైన రేట్లకు అందుబాటులోకి వస్తాయని అన్నారు. డీలర్లు నిబంధనల ప్రకారం మెషిన్లను ఉపయోగించి సరఫరా జరపాలని తెలిపారు. “ఈ-పాస్ మెషిన్లతో ఎరువుల పంపిణీ మరింత సమర్థవంతంగా సాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, వ్యవసాయ సహాయ సంచాలకులు కే దామోదర్ రెడ్డి,జి నర్సింగం, వ్యవసాయ అధికారి రవీందర్ , టెక్నికల్ ఏవో కృష్ణారెడ్డి , కోరమండల్ ఇంటర్నేషనల్ కంపెనీ జోనల్ మేనేజర్ సుజన్ కుమార్ , సుమన్ రెడ్డి , కోరమండల్ కంపెనీ సిబ్బంది మరియు వరంగల్ జిల్లాలోని ఎరువుల రిటైల్ డీలర్లు పాల్గొన్నారు.

# కల్తీ ఎరువులు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు

**ప్రస్తుత వాతావరణ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి**

**కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు**

**ధాన్యం కొనుగోళ్లు, రవాణా వేగవంతం చేయాలి**

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

**తొలి సమయం, మహబూబాబాద్ మే 23:**



జిల్లాలో కల్తీ ఎరువులు, అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుం టామని, ప్రస్తుత వాతావరణ నేప ్థ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, కలెక్టరేట్,ఎస్పీ కార్యాలయాలలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు, చేయడం జరిగిందని ,ధాన్యం కొనుగోళ్లు, రవాణాలో వేగవంతం చేయాల న్నారు జిల్లా కలెక్టర్,శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుండి జిల్లాలోని అందరూ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, తహసిల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులతో, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మచారి, జిల్లా సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ సుధీర్ రామ్నాథ్ కేకన్, తో కలిసి జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు,ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎరువులను అధిక ధరలకు అమ్మితే, కల్తీ ఎరువులను సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, హెచ్చరించారు,ఎరువుల షాపులలో లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్ రిజిస్టర్, యూరియా, డిఏపి, తదితర పురుగుల మందులు ఫర్టిలైజర్స్ స్టాకులను సీడ్స్ డీలర్స్ పక్కాగా మెయింటైన్ చేయాలని, లేనిపక్షంలో సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు, మండల గ్రామస్థాయిలలో ప్రత్యేక స్పెషల్ టాస్క్ ఫోర్స్ కమిటీ ల నిరంతరం నిఘా, తనిఖీలు చేయడం జరుగుతుందని అన్నారు, ప్రస్తుత వాతావరణ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రధాన కార్య స్థానం లోనే ఉండాలని, ఇలాంటి విపత్తుకర సంఘటనలు వచ్చిన ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, ముందస్తు ప్రణాళిక ప్రకారం వాగులు, చెరువులు, వంకలు, తదితర ప్రదేశాలను సందర్శించాలని,గత వరదల నేపథ్యంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు, వాతావరణ పరిస్థితుల కారణంగా ఏదైనా సహాయక చర్యలు అవసరం అయితే,,జిల్లా కలెక్టరేట్ లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ టెలిఫోన్ నెంబర్, 7995074803 లో సంప్రదించాలని ఆయన కోరారు, జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇప్పటికే క్షేత్రస్థాయిలో అన్ని విభాగాల అధికారులు తాసిల్దారులు పనిచేయడం జరుగుతుందని, రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని తరలించాలని, సూచించారు,వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలని, రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు, రెండు మూడు రోజుల్లో జిల్లాలోని లక్ష్యం పూర్తిచేయాలని ఆదేశించారు,ీత రాబోయే రెండు మూడు రోజుల్లో వర్షాల సూచన ఉన్నందున స్థానిక మండల అధికారులు రైతులకు మీడియా మిత్రులకు సమాచారం అందిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు,సూపర్డెంట్ ఆఫ్ పోలీస్, సుధీర్ రామ్నాథ్ కేకన్ మాట్లాడుతూ జిల్లాలో కల్తీ ఎరువులు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులతో సమన్వయంతో పని చేస్తామని అన్నారు, ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృశ్య గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఫోన్ నెంబర్ 8712656922 లో సంప్రదించాలని ఆయన సూచించారు, పోలీస్ యంత్రాంగం కల్తీ ఎరువులు, వాతావరణ పరిస్థితులు, ధాన్యం కొనుగోలు, అన్ని అంశాలపై సంబంధిత అధికారులతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు, ఈ సమావేశంలో జెడ్పి సీఈవో పురుషోత్తం, డిఆర్డిఓ పిడి మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, డిఎవో విజయనిర్మల, డిపిఓ హరిప్రసాద్, డివిహెచ్ఓ డాక్టర్ కిరణ్ కుమార్, డిహెచ్ఓ మరియన్న, ఏడి ఎస్ఎల్ఆర్ నరసింహమూర్తి, గ్రౌండ్ వాటర్ వేముల సురేష్, డీఎస్ఓ ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, అన్ని మండల కార్యాలయాల నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి మంత్రి కొండా సురేఖ



**తొలి సమయం వరంగల్ మే 23**

సంగారెడ్డి జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు సహచర మంత్రులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన అటవీ,పర్యావరణ ,దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖజహీరాబాద్ నిమ్జ్ భూసేకరణలో భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, రైతులు సహకార వ్యవస్థను ఏర్పాటు చేసుకొని వస్తే 100 ఎకరాల్లో కొత్త చెరుకు ఫ్యాక్టరీ ఏర్పాటుకు సహాయంతో పాటు మొత్తం 494.67 కోట్లతో చేపట్టబోతున్న అభివృద్ధి పనులకు ఈరోజు శంకుస్థాపన చేయటం జరిగింది.

## గ్రామ పాలనా అధికారుల రాత పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**తొలి సమయం మహబూబాబాద్ మే 23:**
ఈ నెల 25వ తేదీన జరగనున్న గ్రామ పాలనా అధికారుల రాత పరీక్షను కట్టుదిట్టంగా నిర్వహించాలని లిజిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పేర్కొన్నారు.శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలో కలెక్టర్ చాంబర్ లో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఎస్పీ. సుధీర్ రాంనాథ్ కేకన్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మ చారీ లతో కలిసి సంబంధిత అధికారులతో పరీక్ష నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలో ఈ నెల 25వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరగనున్నట్లు తెలిపారు.జీపీఓల నియామకంలో భాగంగా పూర్వ వీఆర్వో, వీఆర్ఏలకు ఆప్షన్ల కింద అవకాశం కల్పించి జిల్లా లో( 152) మంది ఈ పరీక్షకు హాజరుకానున్నారని వెల్లడించారు.పరీక్షా కేంద్రంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, తాగునీరు, మూత్రశాలలు, తదితర మౌలిక వసతులను కల్పించాలని, వైద్య సిబ్బంది సరిపడా ఔషధాలతో కేంద్రం వద్ద అందుబాటులో ఉండాలని, ఎక్కడా కూడా మాస్ కాపీయింగ్ కు ఆస్కారం ఇవ్వకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పక్కాగా, ప్రశాంత వాతావరణంలో పరీక్షను జరిపించాలన్నారు. పరీక్ష కేంద్రంలోకి ఎవరికీ కూడా మొబైల్ ఫోన్ లకు అనుమతి లేదన్నారు. అలాగే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశాకే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలన్నారు. అదే విధంగా పరీక్ష ప్రశ్న పత్రాలను అత్యంత జాగ్రత్తగా పటిష్ట భద్రత నడుమ పరీక్ష కేంద్రానికి చేరవేయాలని, జవాబు పత్రాలను కూడా నిర్దేశిత ప్రాంతాలకు పంపించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎ. రవీందర్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి రవి రాథోడ్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదార్, మహబూబాబాద్ టౌన్ సి.ఐ పి.సర్వయ్య, కలెక్టరేట్ ఏ.వో పవన్ కుమార్, సి.సెక్షన్ సూపరిండెంట్ వినోద్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## టయోటా షోరూంను ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని



**తొలి సమయం పట్టని కొత్తగూడెం జిల్లా మే 23**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పట్టణంలోని విద్యానగర్ నందు రాయల్ ఫర్నిచర్ షోరూమ్ ప్రక్కన నూతన కాకతీయ టయోటా కార్ షోరూమ్ ను కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, టయోటా కంపెనీ వారు నూతన టెక్నాలజీతో రకరకాల కార్లు తయారుచేసి కొత్తగూడెం పాల్వంచ పట్టణ ప్రజలకు ఈ నూతన షో రూమ్ ద్వారా పేద మధ్య తరగతి వారికి అది తక్కువ ధరలకు అందించాలని దృక్పథంతో జిల్లా కేంద్రంలో షోరూం ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రజలు వారికి నచ్చిన కార్లను కొనుగోలు చేసి టెక్నాలజీకి అనుకూలంగా కార్లను వినియోగించుకోవాలని తెలియజేశారు. ఏ కారునైనా వివిధ ఫైనాన్స్ సంస్థల ద్వారా ఈఎంఐ పద్ధతిలో కొనుగోలు చేసుకోవచ్చును మరియు తక్షణమే ఎక్స్చేంజ్ సౌకర్యం కూడా కలదు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది కస్టమర్లు వివిధ ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు మరియు కొత్తగూడెం పట్టణ ప్రముఖులు పాల్గొని విజయవంతం చేశారు

## బడిబాట కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలల్లో

# విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలి

### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**తొలి సమయం వరంగల్ మే 23**
హనుమకొండ: జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచే విధంగా బడిబాట కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రానున్న విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచే విధంగా చేపట్టనున్న బడిబాట కార్యక్రమం పై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమ నిర్వహణకు ప్రణాళిక అవసరమని, తహసిల్దార్, ఎంపీడీవోలు, ఎంఈఓ లు సమన్వయంతో కార్యక్రమాలను విజయ ంవంతం చేయాల న్నారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలు సమావేశాన్ని నిర్వహించుకోవాలని, మండల ప్రత్యేకాధికారిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు. గ్రామాలలో బడిబాట పై అవగాహన కార్యక్రమాలు అధికారులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. బడిబాట కార్యక్రమాల నిర్వహణతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరిగే విధంగా కృషి చేయాలన్నారు. జూన్ 6వ తేదీ నుండి వివిధ కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రగతిలో వెనకబడిన విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో కంప్యూటర్ విద్యా బోధన ద్వారా మెరుగుపరిచే విధంగా నిరంతర పర్యవేక్షణ చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. పాఠశాలల విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి ఏకరూప దుస్తులు సిద్ధంగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులు అయిన విద్యార్థులు ప్రభుత్వ, కేజీబీవీ విద్యాసంస్థల్లో ఇంటర్మీడియట్ చదివేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. పాఠశాలలకు అవసరమైన వసతుల కల్పన విషయమై ఎంపీడీవోల దృష్టికి తీసుకెళ్లి ఎంఎన్ఆర్ ఈజీఎస్ ద్వారా పనులు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా బడిబాట కార్యక్రమాల నిర్వహణపై జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి వివిధ అంశాల గురించి సంబంధిత శాఖల అధికారులకు వివరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విద్యాలత, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, బీసీ వెల్ఫేర్ అధికారి లక్ష్మణ్, ఎంఈవోలు, తర అధికారులు పాల్గొన్నారు.

## పెద్దవంగర, పాలకుర్తి, రాయపర్తి వివాహాలలో

# పాల్గొన్న పాలకుర్తి కాంగ్రెస్ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి

**తొలి సమయం తొర్రూరు మే 23**
పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి నియోజకవర్గంలోని పెద్దవంగర మండలం ఔసాల్ తండా, పాలకుర్తి మండలం వావిలాల గ్రామంలోని ఫంక్షన్ హాల్, రాయపర్తి మండలం జగన్నదపల్లి దుబ్బ తండా, గుబ్బడి తండా, వరంగల్ ఉప్పరిపల్లి క్రాస్ రోడ్డు లో ఉన్న ఫంక్షన్ హాల్లో నిర్వహించబడిన పలు వివాహ మహెూ త్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివాహ బంధంతో ఒక్కటైన నూతన వధూవరులను వారు స్వయంగా ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖశాంతులతో కొనసాగాలని శుభాకాంక్షలు తెలిపారు..వివాహ వేడుకల్లో పాల్గొనడం ద్వారా ప్రజల మధ్య అనుబంధం పెరిగేలా చూసే తన విధిగా భావిస్తున్నట్టు వారు తెలిపారు. ఒక్కొక్క కుటుంబాన్ని ప్రత్యక్షంగా కలసి, వారి సంతోషాలను పంచుకోవడం తనకెంతో ఆనందాన్ని కలిగిస్తుందని వారు అన్నారు.



వివాహం అనేది జీవితంలో ఎంతో పవిత్రమైన క్షణమని, దాన్ని సమర్థవంతంగా జరుపుకోవడం ప్రతి కుటుంబానికీ గౌరవమైన విషయమని అభిప్రా యపడ్డారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొని వధూవరులను అభినందించారు. నియోజకవర్గ ప్రజలతో నిత్యం సాన్నిహిత్యాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో ఈ తరహా కార్యక్రమాల్లో పాల్గొనడం జరుగుతోందని వారు స్పష్టం చేశారు..

## నేరాలు ఘోరాలు అదుపు చేయడంలో

# విద్యార్థులు కీలక పాత్ర పోషించేలా వారిని తయారు చేయాలి

### షీ టీం ఎస్ఐ సునంద




**తొలి సమయం మహబూబాబాద్ మే 23:**
ఏకశిల హెూలీ ఏంజెల్స్ స్కూల్ నందు జరిగేట టువంటి ఉపాధ్యాయ ట్రైనింగ్ నందు ప్రభుత్వ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులకు షీ టీం, భరోస, సైబర్ క్రైమ్ లపై అవగాహన సదస్సు నిర్వహించారుజిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ ఆదేశానుసారంగా ఏకశిల హెూలీ ఏంజెల్ స్కూల్ మహబూబాబాద్ నందు షీ టీం, భరోసా మరియు సైబర్ క్రైమ్ గురించి అవగాహన కార్యక్రమంలో షీ టీం ఎస్ఐ సునంద సైబర్ క్రైమ్ ఎస్సై కరుణాకర్ సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారునేరాలు అఘాయిత్యాలు పెరుగుతున్న నేటి కాలంలో నేరాల అదుపులో విద్యార్థులు కీలకపాత్ర పోషించేలా వారిని తీర్చిదిద్దాలని, విద్యార్థులు క్రమశిక్షణను కలిగి ఉండడం వలన మరియు మంచి నడవడికతో జాగ్రత్తగా వెలగడం వలన వల్ల నేరాలను అదుపు చేయవచ్చని మహబూబాబాద్ షీ టీం ఎస్సై సునంద అన్నారు.ఈ అవగాహన కార్యక్రమం నందు భరోసా సెంట్రల్ కోఆర్డినేటర్ జోష్ణ మరియు భరోసా స్టాప్ జయశ్రీ, రేణుక ,యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఉమెన్ కానిస్టేబుల్ సుప్రజ, షీ టీం సిబ్బంది అరుణ, రమేష్ ,సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమం నందు మహబూబాబాద్ గవర్నమెంట్ స్కూల్స్ హెడ్మాస్టర్లు, ఫిజికల్ డైరెక్టర్స్ మరియు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల వీరికి అవగాహన కార్యక్రమం నిర్వహించినారు. ముఖ్యంగా అమ్మాయిలు ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ లాంటి సోషల్ మీడియాలలో వ్యక్తిగత ఫోటోలు వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలనిసూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలి వివరించారు.సమస్య ఏదైనా ఎదురైనప్పుడు తక్షణ సాయం కోసం ఎమర్జెన్సీ నెంబర్ డయల్ 100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు.మనకు తెలియని నెంబర్స్ నుండి మహిళలకు ఎవరి నుండైనా ఇబ్బందులు గురైనప్పుడు, ఎవరైనా మహిళలపై అనుచితంగా అసభ్యంగా ప్రవర్తించినట్లయితే ధైర్యంగా షీ టీం వారికి సమాచార అందించాలని సూచించారు. ప్రభుత్వ రంగ పాఠశాలల నందు ఎలాంటి ర్యాగింగ్ చర్యలకు పాల్గొనకుండా చూడాలని కోరారు. మా షీ టీం మొబైల్ నెంబర్స్ మరియు వాట్సాప్ నెంబర్స్ 871 2656 935 ఫిర్యాదు చేయవచ్చని ఫిర్యాదు చేసిన వివరాలు గోప్యంగా ఉంచబడతాయని, నేరస్తులకు కౌన్సిలింగ్ ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. విద్యార్థినిలకు సమస్యలు ఎదురైనప్పుడు వారిని షీ టీం ను సంప్రదించేలా చేయాలని అలా చెప్పుకోవడం ద్వారా నేరాలను ప్రాథమిక దశలోనే నివారించవచ్చని వారు పేర్కొన్నారు.ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులందరికీ టి-సేఫ్ యాప్ గురించి ప్రతి ఒక్కరు దాని ఉపయోగించుకొని ప్రయాణాలలో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని వివరించారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101

# పహల్గమ్,అబుజ్ మాడ్ హత్యలపై న్యాయ విచారణ జరిపించాలి

**ఆపరేషన్ కగార్, సింధూర్ లో దాగి ఉన్న అసలు నిజాలు**

**బహిర్గతం చేయాలని సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ సదస్సు**




**తొలిసమయం, ఇల్లందు.మే, 23.**

పహల్గామ్,అబుజు మాడ్ లపై న్యాయవిచారణ జరిపించాలని ఆపరేషన్ కగార్,సింధూర్ లో దాగి ఉన్న అసలు నిజాలను బహిర్గతం చేయాలని లిసిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు .సిపిఐ(ఎం-ఎల్)న్యూ ¯మోక్రసీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం ఇల్లందులోని పెన్షనర్ల భవన్లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వర రావు అధ్యక్షతనలి జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పహల్గమ్ ప్రధానంగా పర్యాటకుల ప్రాంతమని,ఇక్కడికి అనేకమంది ప్రజలు విహార యాత్రలకు వస్తూ ఉంటారని అన్నారు.కేంద్ర ప్రభుత్వం భద్రతా బలగాల లోపాల వలన పహల్గం దాడి జరిగిందని ఆయన అన్నారు.ఈ పహల్గం దాడిని ఉగ్రవాద చర్యల్ని ఖండిస్తూనే 370 ఆర్టికల్ తర్వాత ఎలాంటి యుద్ధాలు ఉగ్రవాద చర్యలు ఉండవని ప్రకటించిన నరేంద్ర మోడీ ఈ పెహల్గాం దాడి ఎలా జరిగిందో చెప్పాలని ఆయన అన్నారు. 163 దేశాల సభ్యత్వం కలిగిన యుఎన్ఓ లో చర్చించకుండా భారత పార్లమెంటులో చర్చించ కుండా ప్రతిపక్షాలతో చర్చించకుండా యుద్ధానికి వెళ్లి వెనక్కి రావడంలో అంతర్వేమిటో నరేంద్ర మోడీ తెలపాలని వారన్నారు. అకస్మాత్తుగా మే 7న యుద్ధాన్ని ప్రకటించి మే 10న అకస్మాత్తుగా యుద్ధాన్ని విరమించడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటో తెలియజేయాలని వారు డిమాండ్ చేశారు. ఇరుదేశాల ప్రజల శాంతి కోరుకుంటు న్నామని యుద్ధం ప్రకటించిన దేశాలు నేడు మన దేశంలో ఉన్నటువంటి పౌరులని ఈ దేశ హక్కుల కోసం ప్రజాస్వామ్యం కోసం పోరాడుతున్న ఆదివాసీలను ,నక్సలైట్లనుఎలా హతమారుస్తున్నారని ఆయన ప్రశ్నించారు. 140 కోట్ల ప్రజల శాంతి కోరుకుంటున్నాం అని చెప్పే పాలకులు శాంతి చర్చలకు వస్తామని చెప్పిన మావోయిస్టుతో ఎందుకు శాంతి చర్చలు జరపడం లేదని ఆయన అన్నారు. ఆపరేషన్ కగార్ ఆపరేషన్ సింధూరులో దాగి ఉన్న రహస్యాలని బహిర్గతం చేయాలని వారు అన్నారు.ఇవన్నీ కూడా ఆదివాసీల ఖనిజ సంపదను దోచుకుపోవడం కోసం ఆదివాసులను అంతమొందించడం కోసం జరిగే యుద్ధమే అని వారన్నారు.ఈ యుద్ధాలు ఎన్కౌంటర్లు అన్నీ కూడా ఆదాని,అంబానీ కార్పొరేట్ శక్తుల కోసమేనని ఆయన గుర్తు చేశారు.ఈ దాడుల ప్రారంభం జరిగిన తీరు కాల్పుల విరమణ ఒప్పందం వీటిలో సామ్రాజ్య వాద శక్తుల పాత్ర విదేశీ శక్తుల పాత్ర ప్రజలు తెలుసుకోవాలని హత్యలపై ఆపరేషన్ పేరుతో జరుగుతున్న హత్యలపై అన్ని వాస్తవాలను బహిర్గతం చేయాలని సిపిఐ (ఎం-ఎల్)న్యూడెమోక్రసీ డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు కే. సారంగపాణి,ఏఐటిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సూర్ణపాక నాగేశ్వరరావు, జిల్లా కన్వీనర్ మోకాళ్ల రమేష్,సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పొడుగు నరసింహారావు ,తోడేటి నాగేశ్వరరావు,కల్తీ వెంకటేశ్వర్లు ,ఎట్టి నర్సింహారావు, పూణెం రంగయ్య ,బట్టు ప్రసాదు, హార్జ్య,యాసారపు వెంకన్న ,మాజీ సర్పంచులు మోకాళ్ళ కృష్ణ,వాంకు డోత్ శ్రీను,అరుణోదయ జిల్లా కార్యదర్శి ఎనగంటి చిరంజీవి,పి వై ఎల్ రాష్ట్ర నాయకులు మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## పలు శుభకార్యాలలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

# మాజీ జెడ్పిటిసి మేకల మల్లిబాబు యాదవ్

**తొలిసమయం, ఇల్లందు.మే, 23.**



పెళ్లిళ్లకు శుభకార్యాలకు ముహూర్తాలు బాగా ఉండటం వలన రాజకీయ నాయకులు కూడా తీరుబడి లేకుండా భగభగ మండే ఎండలను సైతం లెక్కచేయకుండా ఆహ్వానించిన వారి దగ్గరకు తప్పక వెళ్లవలసిన వస్తుంది. ఈ క్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పలు శుభకార్యాలలో పాల్గొని అక్షింతలు వేసి చిరంజీవులను ఆశీర్వదించారు. కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన మోదుగు ఆనందరావు- రమణ ల కుమారుడు ప్రేమ్ కుమార్ - జ్యోతి( చింతకాని మండలం అనంత సాగర్ గ్రామానికి చెందిన సూరే పల్లి నరసింహారావు లక్ష్మి గార్ల పుత్రిక )ల వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను అక్షంతలు వేసి ఆశీర్వదించారు. తదనంతరం కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో జరిగిన ఆంగోత్ బావ్ సింగ్ మల్లీశ్వరి ల కుమార్తెలు సాహితీ దీక్షిత ల కు చెవులు కుట్టించు వేడుక కార్యక్రమంలో పాల్గొన్నారు. తదనంతరం ఖమ్మం 7వడివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ -నాగమణి ల మనవడు వేదాన్ష్ ( వెంకయ్య)కు జరిగిన అన్నప్రాసన వేడుకలో పాల్గొని, ఖమ్మం నగరం ఏడో డివిజన్ కు చెందిన చింతల ఉపేందర్ ఉమా ల పుత్రికలకు నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో పాల్గొనిచి రంజీవులను ఆశీర్వదించారు. మరియు ఖమ్మం నగరానికి చెందిన పసుమర్తి రామచంద్రయ్య గారి సతీమణి కోటిరత్నం దశదిన కార్యక్రమాలలో పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తదనం తరం పిఎసిఎస్ కొండాయిగూడెం గ్రామంలో జరిగిన అధికారిక కార్యక్రమాలకు కామేపల్లి పి ఎస్ ఎస్ అధ్యక్షులు టిపిసిసి మెంబర్ పుచ్చకాయల వీరభద్రం మరియు కొండాయి గూడెం పిఎసిఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు తో కలిసి హాజరైనారు.ఇంకా పలు శుభ కార్యక్రమాల్లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు ఏపూరి మహేందర్,షేక్ ఫతే మహమ్మద్, గింజల నర్సిరెడ్డి బానోతు నరసింహ నాయక్, భూక్య నాగేంద్ర బాబు, శీలం పుల్లయ్య పొదిలి,భూపతి మోదుగు రాము, వల్లపు నాగేశ్వరరావు, చిలకల నాగేశ్వర రావు, ధరావత్ లాలు దాసరి గురేష్, దా రావత్ సురేష్ గుండ్ల వెంకన్న గుండ్ల చిరంజీవి, మంద రవి, కోటేశ్వరరావు, మోదుగు రమేష్, నీరుడు నరేష్ జక్కంపూడి ఉపేందర్, చల్ల మల్లయ్య, పాటి బండ్ల ప్రసాదు సత్తి వెంకన్న బండారు ప్రభాకర్, బాదావత్ నాగరాజు, బానోతులాకు భానోత్ చందు ,మరియు తదితర బంధుమిత్రులు పాల్గొన్నారు.

## పామాయిల్ తోటలు పరిశీలించిన భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు :-ప్రభాకర్ రెడ్డి.



**తొలిసమయం, ఇల్లందు.మే, 23.**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి గారు ఈరోజు దమ్మపేట మండలం మారుమూల గిరిజన ప్రాంతం పామాయిల్ గిరిజన రైతు తోటలు జగ్గారం. గండుగులపల్లి గ్రామాలలో సన్నా చిన్న కారు రైతు తోటలు పరిశీలించి ఆఫ్ టైప్ మొక్కలను ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో వారి తోటలు చూసి కొన్ని చెట్లు తొలగించిన వాటిని కూడా పరిశీలించడం జరిగింది..ప్రభాకర్ రెడ్డి పామాయిల్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ 1.పామాయిల్ తోటలు వేసుకుని అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సోదరులను ప్రోత్సహిస్తూనే మరొక్క కుంభకోణం కొం తమంది అధికారులు చేస్తుం టే రక్షించ వలసిన వాళ్ళు కాపాడ వలసిన వాళ్లు ఈ జిల్లాలో ముగ్గురు మంత్రులు గిరిజన ఎమ్మెల్యేలు ఉన్నా కూడా అక్రమాలు అరికట్టలేని పరిస్థితుల్లో ఉన్నారని వ్యక్తపరిచారు. 2016 నుండి 2022 వరకు ఓ ప్రభుత్వ ఉద్యోగి నాసిరకం మొక్కలు నర్సరీలో కలిపి రైతు తోటలకి సప్లై చేసినారని రైతులు ఆవేదన వ్యక్తపరుస్తూ ఉంటే కనీసం రైతు బాధ తెలుసుకోవటానికి స్థానిక ఎమ్మెల్యేకూడా మా బాధలు తెలుసుకోవడానికి ఖాళీ లేనట్లు వ్యవహరిస్తున్నారని వ్యక్తపర్చుతున్నారు. నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పించండి. విత్తన చట్టంలో ఆయిల్ ఫామ్ ని చేర్చండి. అక్రమాలను వెలుగు తీయండి. మీరు చేయకపోతే మా బిజెపి పార్టీ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తెలియపరిచి తగు న్యాయం చేయుటకు రైతు పక్షాన మేము ఉంటామని ఈ సందర్భంగా రైతులకు హామీ ఇచ్చారు.లిగిరిజన నాయకుడులికారం శ్రీరాములు మాట్లాడుతూ. మా గిరిజన హరిజన సన్న చిన్న పామాయిల్ రైతు సోదరులు విజ్ఞప్తి మేరకే ఈ ఆఫ్ టైప్ పామాయిల్ మొక్కల సమస్య ప్రభుత్వ దృష్టికి కేంద్ర ప్రభుత్వ దృష్టికి సంబంధించిన అందరికీ తెలియపరుస్తారని ఉద్దేశంతో ఈరోజు ఈ సమస్య ఈ జిల్లా బిజెపి అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి గారికి వివరించటం జరిగింది మా యొక్క సమస్యని తెలుసుకొని మా గిరిజన తోటలు నష్టపోయిన రైతు సోదరుల తోటలను ప్రత్యక్షంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు న్యాయం చేస్తారని న్యాయం చేయాలని ఈ సమస్య పరిష్కారం కోసం రైతు సోదరులకు అండగా ఉండాలని ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వారిని గిరిజన నాయకుడిగా కోరనైనది.ఈ కార్యక్రమంలో.. రైతులు రైతు సంఘ నాయకులు తుంబూరు మహేష్ రెడ్డి చెలికాని సూరిబాబు వెంకట్రావు కొరస. వీరస్వామి. కురుస ముత్యాలు కొమరం భీముడు వెంకటరావు వసంతరావు వీరస్వామి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

## జూలై 23న ఢిల్లీలో బీఎంఎస్

# 70వ స్వర్ణోత్సవ ముగింపు వేడుక

**అభినందనలు తెలిపిన తెలంగాణ డబ్ల్యూజేఐ**



**ఢిల్లీ: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)** 70 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా యువ సమ్మేళనం, మహిళా సమ్మేళనం వంటి వివిధ కార్యక్రమాలు దాదాపు ఏడాది పొడవునా దేశవ్యాప్తంగా జరిగాయి. ఇప్పుడు ముగింపు వేడుకను జూలై 23న ఢిల్లీలోని టాల్కోటోరా స్టేడియంలో నిర్వహిస్తున్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన ప్రచార బృందం సమావేశంలో జాతీయ సంస్థాగత కార్యదర్శి బి. సురేంద్రన్, ప్రాంతీయ సంస్థాగత కార్యదర్శి అనుపమ్ జీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. దీపేంద్ర చహర్ మీడియా ప్రతినిధులు , సోషల్ మీడియా కార్యకర్తలతో కలిసి సమావేశమయ్యారు. ప్రాంతీయ సంస్థాగత కార్యదర్శి అనుపమ్ జీ సమావేశాన్ని ప్రారంభించి, సంవత్సరం పొడవునా జరుగుతున్న కార్యక్రమాల గురించి, రాబోయే కార్యక్రమంపై వివరాలు తెలిపారు. తరువాత, జాతీయ సంస్థాగత కార్యదర్శి బి. సురేంద్రన్ జీ మాట్లాడుతూ, 1955లో భోపాల్‌లో ప్రారంభమైన భారతీయ మజ్దూర్ సంఘ్ 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించామని 70 ఏళ్ల ప్రయాణంలో నంబర్ వన్ ట్రేడ్ యూనియన్‌గా ఎదిగామని చెప్పారు. భారతీయ మజ్దూర్ సంఘ్ మానవ, సామాజిక మరియు జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పని చేస్తుందన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 6200కి పైగా సంఘాలు మరియు 2 కోట్లకు పైగా సభ్యులు ఉన్నారని తెలిపారు.ఈ సమావేశంలో ప్రచార అధిపతి సర్వేష్ మిశ్రా, వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి నరేంద్ర భండారి, జాతీయ అధ్యక్షుడు (ప్రస్తుత) సంజయ్ ఉపాధ్యాయ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ సక్సేనా, సీనియర్ జర్నలిస్టు శివాజీ సర్కార్, నరేంద్ర ధవన్, సందీప్ శర్మ, ఇష్ మాలిక్, ఫోటో జర్నలిస్టు జగ్జీత్ సింగ్, సుధీర్ సలుజా, ద్వారకర్ కుందూ, సంజీవ్ చౌహాన్, ప్రమోద్ గోస్వామి, అమృత్ తదితరులు పాల్గొన్నారు. బీఎంఎస్ 70వ స్వర్ణోత్సవ ముగింపు వేడుకలు నిర్వహించుకుంటున్న సందర్భంగా వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ), తెలంగాణ శాఖ గౌరవాధ్యక్షుడు నందనం కృపాకర్, అధ్యక్షుడు రాణా ప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్ లు అభినందనలు తెలిపారు.

## జేఈఈ మెయిన్స్ బి ఆర్చ్ విభాగంలో

## లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థిని ప్రభంజనం



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 23భద్రాచలం**

ఇంటర్ ఫలితాలలో సంచలన మార్కులతో పాటు ఎంసెట్ ఫలితాలలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఉత్తమ ర్యాంకులు సాధించిన లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థుల హవా జేఈఈ మెయిన్స్ లో కూడా కొనసాగిన విషయం తెలిసిందే. శుక్రవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ బి ఆర్చ్ ఫలితాలలో సైతం లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థిని అయిన ముత్యాల శ్రీ భాగ్య ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో 513 వ ర్యాంకు మరియు బి ప్లానింగ్ లో 435 వ ర్యాంక్ సాధించి మరో సంచలనానికి కేంద్ర బిందువు అయ్యారు. ఈ సందర్భంగా లిటిల్ ఫ్లవర్స్ విద్య సంస్థల డైరెక్టర్ మాగంటి రమేష్ బాబు శ్రీ భాగ్య ను అభినందించి మాట్లాడుతూ సీనియర్ ఇంటర్ ఫలితాలలో 993 మార్కులతో సంచనాలను సృష్టించిన మా విద్యార్థులు ఎంసెట్ ఫలితాలు సైతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనే అత్యుత్తమ ర్యాంకులను సాధించారని అన్నారు జేఈఈ మెయిన్స్ ఫలితాలు సైతం అత్యుత్తమ పర్సంటేజ్ లిటిల్ ఫ్లవర్స్ కే సొంతమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జేఈఈ మెయిన్స్ బి ఆర్చ్ విభాగం సైతం 513 ర్యాంకు సాధించి పరీక్ష ఏదైనా ఉత్తమ ఫలితం మాత్రం లిటిల్ ఫ్లవర్స్ కే సొంతమని నిరూపించారని కొనియాడారు. ఈ ఫలితాలు తమపై బాధ్యత మరింతగా పెంచాయని భవిష్యత్తులో ఇంతకుమించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని అన్నారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల శిక్షణతో పాటు తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమవుతున్నాయని అన్నారు అనంతరం ముత్యాల శ్రీ భాగ్య కు జ్ఞాపిక ను అందించి తన తండ్రి రాంబాబుని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్ ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు